క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(లీగల్): నెల్లూరు రూరల్ నియోజక వర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి శుభాకాంక్షలను తెలియజేశారు. కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ రంగారావు, పద్మాకర్, నర్సయ్య, హరిబాబు, ప్రణీత్‌రెడ్డి, లతీఫ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్‌కు నివాళులు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ జయంతిని ఆవాజ్ నేతలు బుధవారం నిర్వహించారు. వెంకటేశ్వరపురం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, నేతలు రియాజ్, ఫయాజ్, చాంద్‌బాషా, కరిముల్లా, షమీవుల్లా, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

11న ఆర్చరీ జిల్లా జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆర్చరీ జిల్లా జట్లను ఈ నెల 11న ఎంపిక చేయనున్నామని ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఓల్గా అకాడమీలో ఫిబ్రవరి 28 నుంచి మార్చి మూడు వరకు నిర్వహించనున్న రాష్ట్ర ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో వీరు పాల్గొననున్నారని చెప్పారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వేణు వద్ద నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సరస్వతీనగర్ ఫీడర్‌లో గల పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా గురువారం ఉండదని వెస్ట్ - 1 ఏఈ లక్ష్మీబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రాంతినగర్, సరస్వతీనగర్, మాగుంట నివాసం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

నెల్లూరు రచయితలకు జాతీయ పురస్కారాలు

నెల్లూరు(బృందావనం): నెల్లూరుకు చెందిన రచయితలు పెరుగు రామకృష్ణ, వెంకటప్పయ్య జాతీయ పురస్కారాలకు ఎంపికయ్యారు. తమ రచనలను పరిగణనలోకి తీసుకొని భోపాల్‌లోని లయన్స్ క్లబ్ భవనంలో ఈ నెల 17న నిర్వహించనున్న వార్షిక సాహిత్య కార్యక్రమంలో సరస్వతీ సమ్మాన్, భారత్ భాషా భూషణ్ పురస్కారాలను అందజేయనున్నారని వారు తెలిపారు.

11న ఘంటసాల వర్ధంతి

నెల్లూరు(బృందావనం): అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతిని పుర మందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో ఈ నెల 11న నిర్వహించనున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో బుధవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నటన, సంగీత, నాట్య విభాగాల్లో పోటీలను నిర్వహించి ప్రతిభ చూపే వారికి స్టార్ ఆఫ్ నెల్లూరు అవార్డులను అందజేయనున్నామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. రఘు, రాయప్ప పాల్గొన్నారు.

లౌకిక భారత్‌ను కాపాడుకుందాం

నెల్లూరు (టౌన్): విప్లవ వీరుల స్ఫూర్తితో లౌకిక భారత్‌ను కాపాడుకుందామని పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ రామకృష్ణ పేర్కొన్నారు. నగరంలోని అనితా హాల్లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన లౌకిక సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదా, విభజన హామీల విషయంలో మోదీ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్, కార్యదర్శి లోకేష్, నేతలు షారూఖ్, ఆశీర్వాదం, విష్ణు, మనోజ్, రాంజీ, సాయిదేవ్, తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిలో రాజీ లేదు



సమస్యలను ఆరాతీస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరాభివృద్ధిలో రాజీపడేది లేదని.. రోడ్లు, డ్రెయిన్లు, తదితర పనులను పూర్తి చేస్తున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని 46వ డివిజన్లో గల పణతులవారి వీధి, కాకర్లవారి వీధి, ఆచారి వీధి, తదితర ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డివిజన్ వ్యాపార కేంద్రమని, ఆచారివీధిలో రూ.50 లక్షలతో రోడ్డును నిర్మించనున్నామని వెల్లడించారు. పణతులవారి వీధిలో డ్రెయిన్లు, రోడ్లను నిర్మించనున్నామని చెప్పారు. పార్కింగ్‌కు సంబంధించిన స్థలాన్ని పరిశీలించామన్నారు. మూడు నెలల్లో 500 నుంచి 600 బైక్‌లను పార్కింగ్‌లో ఉంచితే స్థానికంగా ట్రాఫిక్‌ను నియంత్రించొచ్చని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ వేలూరు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'ఓవెల్' ప్రతిభ



నెల్లూరు (టౌన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఓవెల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల డైరెక్టర్ వేణు పేర్కొన్నారు. ఉత్తమ పర్సంటైల్‌ను సాధించిన విద్యార్థులను కళాశాలలో అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. తన్మయి 97.39, అభిలాష్ 95.38, ఉజ్వల్ 94.32, వినీత 94.2, నాగానంద్ 93.5, సాయిధీరజ్ 92.06 పర్సంటైల్‌ను సాధించారని వివరించారు. 20 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారని పేర్కొన్నారు. కళాశాల సీఈఓ ప్రమీల, జీఎం మహదేవన్, ఏజీఎం గంగాధర్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘ వ్యవస్థాపక దినోత్సవం



సుబ్రహ్మణ్యశాస్త్రికి సత్కారం

నెల్లూరు(బృందావనం): నగరంలోని బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఐకమత్యంగా కృషి చేయాలని బ్రాహ్మణ సేవా సంఘ, బాలాజీనగర్ పూర్వాధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. బ్రాహ్మణ సేవా సంఘ, బాలాజీనగర్ వ్యవస్థాపక దినోత్సవాన్ని కురువాడ లలితమ్మ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపక కమిటీ సభ్యులు శ్రీనివాసమూర్తి, రాఘవ రామ్మూర్తి, సుబ్రహ్మణ్యశాస్త్రిని సత్కరించారు. బ్రాహ్మణ సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కామేశ్వరప్రసాద్, కోశాధికారి సత్యనారాయణ, సంఘ ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రసాద్, మహిళా కార్యవర్గ సభ్యులు జయలక్ష్మి, నాగజ్యోతికుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణపై అవగాహన



నెల్లూరు రూరల్: వరి సాగులో పైరుకు ఎలుకలు నష్టం కలిగిస్తున్నాయని, ఈ క్రమంలో సామూహికంగా ఎలుకల నివారణ చర్యలను రైతులు చేపట్టాలని నెల్లూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పెనుబర్తిలో బుధవారం నిర్వహించారు. ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లురెడ్డి, ఏఓ నాగమోహన్, తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసులో నలుగురికి మూడేళ్ల జైలు

నెల్లూరు(లీగల్): అదనపు కట్నం కోసం వివాహితను వేధింపులకు గురిచేసిన కేసులో నేరం రుజువు కావడంతో నలుగురికి మూడేళ్ల జైలు శిక్షను విధిస్తూ ప్రత్యేక మొబైల్ కోర్టు తీర్పునిచ్చింది. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ములుమూడి బస్టాండ్ ప్రాంతానికి చెందిన హారతిబాయ్‌కు తమిళనాడులోని వేలూరుకు చెందిన వినోద్‌సింగ్‌తో 2013, ఫిబ్రవరిలో పెద్దల అంగీకారంతో వివాహం జరిగింది. ఆ సమయంలో కట్న, కానుకల రూపంలో వినోద్‌సింగ్‌కు హారతిబాయ్ తల్లిదండ్రులు రూ.మూడు లక్షల నగదు, 15 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.10 వేల గృహోపకరణాలను ఇచ్చారు. కొంతకాలం వీరు కాపురం సజావుగా సాగింది. అనంతరం హారతిబాయ్‌ను భర్త వినోద్‌సింగ్, మామ అమర్‌సింగ్, అత్త కళావతి, మరిది మదన్ సింగ్ అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా హింసించారు. ఈ క్రమంలో 2016, మేలో హారతిబాయ్‌ను ఇంటి నుంచి గెంటేయడంతో నెల్లూరొచ్చి మహిళా పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో వీరికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ మృదుల వాదించారు.

క్రైమ్ కార్నర్

విశ్రాంత పోలీస్ అధికారి ఇంట్లో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. డైకస్‌రోడ్డులోని ఎస్బీటీ కాలనీలో విశ్రాంత పోలీస్ అధికారి ఉన్నీసాబేగం నివాసం ఉంటున్నారు. కింది పోర్షన్లో ఆమె తమ్ముడు సిరాజుద్దీన్ ఉంటున్నారు. ఇటీవల ఆమె మక్కా యాత్రకు వెళ్లగా.. సిరాజుద్దీన్ సొంత పనిపై కడప వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఆమె ఇంట్లో చోరీకి సోమవారం రాత్రి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న సిరాజుద్దీన్ తన అక్కకు ఫోన్ చేసి ఇంట్లో విలువైన వస్తువులేమైనా ఉన్నాయానని ఆరాతీశారు. ఓ గదిలో 25 సవర్ల బంగారు, మరో గదిలో పింఛన్ నగదు ఉందని ఆమె తెలిపారు. దీంతో ఆయన తన కుటుంబసభ్యులను అప్రమత్తం చేశారు. ఇంటికెళ్లి వారు పరిశీలించగా, బంగారు ఆభరణాలు అక్కడే ఉండటాన్ని కనుగొన్నారు. మరో గదిలో నగదు లేకపోవడాన్ని గుర్తించారు. నగరానికి చేరుకున్న సిరాజుద్దీన్ ఘటనపై వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పింఛన్ నగదు రూ.30 వేల వరకు ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): హెయిర్ కటింగ్ చేయించుకొస్తానని ఇంటి నుంచి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన అనగుంటలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. బీవీ నగర్ సమీపంలోని అనగుంటలో హేమలత తన పిల్లలు, అత్తామామలతో కలిసి ఉంటున్నారు. ఆమె భర్త పుష్పరాజు సౌదీలో ఉంటున్నారు. ఆమె మామ మునీంద్ర ఆచారి రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హెయిర్ కటింగ్ చేయించుకొస్తానని చెప్పి ఇంటి నుంచి ఈ నెల రెండున బయటకొచ్చారు. అప్పటి నుంచి అతని జాడ తెలియరాలేదు. కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు హేమలత ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడి కోసం గాలింపు ముమ్మరం

నెల్లూరు(క్రైమ్): పోలీసుల కళ్లుగప్పి పరారైన నిందితుడి కోసం సీసీఎస్ ప్రత్యేక బృంద ఆధ్వర్యంలో విస్తృత గాలింపు చర్యలను చేపట్టారు. వివరాలు.. నెల్లూరు రూరల్ మండలం ఉప్పుటూరుకు చెందిన పాత నేరస్తుడు గిరిని గొలుసు దొంగతనం కేసుల్లో సీసీఎస్ పోలీసులు ఇటీవల అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా నిందితుడ్ని ఏఎస్‌పేటకు ఈ నెల ఒకటిన తీసుకెళ్లారు. అనంతరం నెల్లూరు తీసుకొస్తుండగా సంగం బీరాపేరు వాగులో దూకి నిందితుడు పరారైన విషయం విదితమే. ఘటనపై సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ గిరిధర్ ఫిర్యాదు మేరకు సంగం పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన స్థలాన్ని ఏఎస్పీ క్రైమ్స్ ప్రసాద్ పరిశీలించి.. నిందితుడ్ని త్వరగా అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో సీసీఎస్ ప్రత్యేక బృందం గాలింపును ముమ్మరం చేసింది. నిందితుడి బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా జాడ తెలియరాలేదు. దీంతో అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులు నమోదు

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. భగత్‌సింగ్ కాలనీకి చెందిన నజీర్ నగరంలోని చెప్పుల షాపులో పనిచేస్తున్నారు. జనార్దన్‌రెడ్డికాలనీకి చెందిన జమీర్ చెప్పుల కొనుగోలు విషయంలో అతనితో మంగళవారం గొడవపడ్డాడు. అనంతరం పూటుగా మద్యం సేవించి దాడి చేసి గాయపర్చారు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

• పాల విషయమై నెలకొన్న వివాదంలో వ్యక్తిపై దాడి చేసి గాయపర్చారు. పోలీసుల సమాచారం మేరకు.. కిసాన్‌నగర్‌కు చెందిన పాల వ్యాపారి పోలయ్య వద్ద స్వామి గతంలో పనిచేశారు. పాల విషయమై వీరి మధ్య కొద్ది రోజులుగా వివాదం సాగుతోంది. ఈ నేపథ్యంలో పోలయ్యపై స్వామి దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు నమోదు చేశారు.


శ్రీనివాసులుకు నివాళి



మాట్లాడుతున్న కనకాద్రి

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మేల్ నర్సింగ్ ఆర్డర్లీగా పనిచేస్తున్న శ్రీనివాసులు మృతి చెందడం బాధాకరమని లెప్రసీ విభాగాధిపతి కనకాద్రి పేర్కొన్నారు. శ్రీనివాసులు సంతాప సభను పెద్దాస్పత్రిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. చర్మ వ్యాధి నిపుణురాలు శ్రీదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజమ్మ, అసోసియేట్ ప్రొఫెసర్ ఉషా, ఫిజియోథెరపిస్ట్ నారాయణ, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, సందానీబాషా, హెల్త్ సూపర్‌వైజర్లు మస్తానయ్య, రమేష్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మారెడ్డి కన్నుమూత



నెల్లూరు (టౌన్): రాష్ట్రీయ రతన్ అవార్డు గ్రహీత, వీబీఆర్ గ్రూప్ విద్యాసంస్థల అధినేత ఊటుకూరు బ్రహ్మారెడ్డి బుధవారం మృతి చెందారు. దర్గామిట్టలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో గల ఆయన స్వగృహంలో భౌతికకాయాన్ని ఉంచారు. మాజీ ఎమ్మెల్యే శేషారెడ్డి, తదితరులు నివాళులర్పించారు.

ఇంటర్న్‌షిప్‌పై ముగిసిన శిక్షణ

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఇంటర్న్‌షిప్‌పై నెల రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. 190 మంది అధ్యాపకులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ప్రిన్సిపల్ గిరి, ఎన్నార్సీ కోఆర్డినేటర్ రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువజన, సంగీత నృత్యోత్సవాలు

నెల్లూరు(బృందావనం): ఆర్టీసీ సమీపంలోని ఎస్వీబీ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో యువజన సంగీత, నృత్యోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గాయని లక్ష్మీప్రసూన, శిష్యులు వైష్ణవి, జయవాసవి గాత్రకచేరి.. త్రిపురనిఖిత బృంద కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. ముఖ్యఅతిథిగా ఆర్డీఓ మలోల హాజరయ్యారు. ప్రిన్సిపల్ సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇక్కట్లు తలెత్తకూడదు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న మలోల, తదితరులు

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ మలోల పేర్కొన్నారు. మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 13 నుంచి 25 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలపై ప్రభుత్వ శాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న అంకురార్పణ, 14న ధ్వజారోహణ, 17న వెండిరావణసేవ, 18న మహాశివరాత్రి, వెండినందిసేవ, 19న స్వామివారి కల్యాణ మహోత్సవం, 20న రథోత్సవం, 23న ధ్వజావరోహణ, 24న దవనోత్సవం, 25న ఏకాంతసేవను నిర్వహించనున్నారని పేర్కొన్నారు. తొలుత ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శ్రీనివాసులురెడ్డి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐపీటీవీ సేవలు ప్రారంభం



నెల్లూరు(మినీబైపాస్): బీఎస్ఎన్ఎల్ నేతృత్వంలో నూతనంగా ఐపీటీవీని ఉల్కా టీవీ సిటీ ఇండియా మీడియా ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. బృందావనంలోని తిక్కన టెలిఫోన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ జీఎం పుగళెంది మాట్లాడారు. ప్రైవేట్ సంస్థలకు దీటుగా వాయిస్, ఫైబర్‌నెట్‌తో పాటు ఐపీటీవీతో టీవీ చానళ్లనూ వీక్షించొచ్చని పేర్కొన్నారు. అతి తక్కువ ధరలకే వాయిస్, బ్రాడ్‌బ్యాండ్, టీవీ చానళ్లను వీక్షించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐపీటీవీ సర్వీసులను ప్రస్తుత వినియోగదారులతో పాటు కొత్తగా కనెక్షన్ తీసుకున్న వారికి ఫ్రాంచైజీల ద్వారా అందించనున్నామని పేర్కొన్నారు. 350 ఫ్రీ, పెయిడ్ చానళ్లను వీక్షించొచ్చని తెలిపారు. ఎస్డీ బేసిక్ ప్లాన్ రూ.239, హెచ్‌డీ బేసిక్ ప్లాన్ రూ.279, రూ.789కే హైస్పీడ్ ఇంటర్నెట్ ఐపీటీవీని పొందవచ్చని వివరించారు. ఉల్కా టీవీ బిజినెస్ పార్ట్‌నర్ సనత్‌రెడ్డి, డీజీఎం శ్రీనివాసరావు, డీజీఎం ఫైనాన్స్ పద్మజ, ఏజీఎం హెచ్ఆర్ అపర్ణ రాణి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లను త్వరలో అందిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లను పేదలకు త్వరలో అందించనున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో గల జగనన్న కాలనీలో నిర్మిస్తున్న గృహాలను అధికారులతో కలిసి బుధవారం పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో దాదాపు పది వేల గృహాల నిర్మాణాన్ని చేపట్టారని వివరించారు. గత ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లను ఇచ్చామని నాటి పాలకులు గొప్పలు చెప్పుకొన్నారని, అయితే ప్రజలపై రూ.మూడు లక్షల భారాన్ని మోపారని ఆరోపించారు. టిడ్కో గృహాలకు సంబంధించి దాదాపు 12 వేల మందికి రూ.మూడు లక్షల చొప్పున పూర్తిగా మాఫీ చేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. అన్ని అనుకూలంగా ఉంటే ఉగాదికి మొదటి విడత కింద మూడు వేల గృహాలను సీఎంతో ప్రారంభించేలా యోచన చేస్తున్నామన్నారు. భగత్‌సింగ్ కాలనీ, కొండ్లపూడి ప్రాంతాల్లోని గృహాలను మరో ఆర్నెల్లో పేదలకు అందించేలా చర్యలు చేపట్టనున్నామని ప్రకటించారు. కార్పొరేటర్ సఫియా, కమిషనర్ హరిత, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.